క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సెక్యూరిటీ గార్డులు

జగిత్యాలటౌన్: ఏజెన్సీ విధానం రద్దు చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డులు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కోరారు. పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 1994 నుంచి రాష్ట్రంలోని వివిధ మార్కెట్ యార్డుల్లో సేవలందిస్తున్నామని, ఏజెన్సీని రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించి, తమ కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. బిశ్వాల్ కమిటీ సిఫార్సుల మేరకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు వెయ్యి రూపాయల ఇంక్రిమెంట్ ఇప్పించేందుకు సహకరించాలని ఎమ్మెల్సీని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జలందర్‌రావు, కార్యదర్శి కిషన్‌రావు, రాకేశ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న కౌన్సిలర్, కాలనీవాసులు

రాయికల్: పట్టణంలోని మండల క్లబ్ రోడ్‌లో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉందని, వర్షపు నీరు నిలువ ఉండి, దోమలతో మలేరియా వ్యాధులు ప్రబలుతున్నాయని, చెత్తబండి, పారిశుద్ధ్య కార్మికులు రాకపోవడంతో పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైందని, వెంటనే సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కన్నక మహేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆందోళన



ఆందోళన చేస్తున్న మాల నాయకులు

పెగడపల్లి: ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో మాల మహానాడు సంఘం నాయకులు బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ, ప్రభుత్వ మద్దతుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని తప్పుపట్టారు. వర్గీకరణ నిర్ణయాన్ని పాలకులు పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో మాల మహానాడు సంఘం నాయకులు శ్రీనివాస్, ప్రదీప్, యేసురత్నం. చంద్, రాజశేఖర్, వినోద్, అశోక్, రాయలింగం, వెంకట్రాజం, రాజమౌళి, నరేశ్ పాల్గొన్నారు.

ఐఎస్ఐ పంపు సెట్లు వాడాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న డీఈ

కోరుట్లరూరల్: రైతులు ఐఎస్ఐ మార్కు గల విద్యుత్ పంపు సెట్లనే వినియోగించాలని మెట్‌పల్లి డివిజన్ విద్యుత్ డీఈ ఆపరేషన్ తిరుపతి రైతులకు సూచించారు. పొలంబాటలో భాగంగా విద్యుత్ అధికారులతో కలిసి మండలంలోని జోగిన్‌పెల్లిలో బుధవారం పొలాల వద్ద పంపు సెట్లను పరిశీలించారు. కెపాసిటర్ బిగించటం వల్ల గలిగే లాభాలు, విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో రూరల్ ఏఈ బుక్యా శ్రీనివాస్ నాయక్, మాజీ సర్పంచ్ రాజనర్సయ్య, విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వరద నీటిని మళ్లించేందుకు చర్యలు

కోరుట్ల: పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు వెళ్లేందుకు మున్సిపల్ ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చారు. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీళ్లు మురికి కాలువల్లోకి వెళ్లేందుకు కాలువలు తీసి నీటిని మళ్లించేందుకు చర్యలు చేపట్టారు. మార్కెట్ ఏరియా, కూరగాయల మార్కెట్ పరిసరాలను శుభ్రపరిచారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.





వరి నాట్లకు ఇతర రాష్ట్రాల కూలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: గ్రామాల్లో వ్యవసాయ పనులకు కూలీలు దొరకని పరిస్థితిలో ఇతర రాష్ట్రాల కూలీలు జిల్లాకు వచ్చి నాట్లేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో వ్యవసాయ పనులు మొత్తం ఇతర రాష్ట్రాల కూలీలే చేస్తున్నారు. ఇంతకుముందు ధాన్యం తూకం వేసేందుకు మహారాష్ట్ర, బీహార్ నుంచి కూలీలు రాగా, ప్రస్తుతం వరి నాట్లకు ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్ నుంచి కూలీలను రప్పించి నాట్లు వేయిస్తున్నారు. స్థానిక కూలీలు నాట్లేయడానికి ఆసక్తి చూపించకపోవడంతో అక్కడి కూలీలకు ఇక్కడ పని దొరుకుతోంది. వీరు దాదాపు 15 మంది బ్యాచ్‌గా ఏర్పడి ఎకరానికి రూ.4500 తీసుకుని నాటు వేస్తున్నారు. ఉదయం 7 గంటలకే పొలానికి వచ్చి, సాయంత్రం 4 గంటల వరకు పనులు చేస్తుంటారు. దాదాపు ఐదారుగురు కూలీలే ఎకరం వరి నారు పీకి, నాటు వేస్తుంటారు. ఆడ మగా తేడా లేకుండా నాటేస్తుండడం విశేషం..

పోటీ పరీక్షల పుస్తకాలు ఏర్పాటుకు కృషి

• ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇస్తున్న నిరుద్యోగులు

జగిత్యాల: గ్రంథాలయంలో పోటీపరీక్షల పుస్తకాలు ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం గ్రూప్–1, 2,3,4, మెయిన్స్ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులు గ్రంథాలయంలో పోటీపరీక్షల పుస్తకాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగిత్యాల గ్రంథాలయంలో అవసరమైన పుస్తకాలు ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని, ఈవిషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరంలాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామానికి చెందిన ఊరడి తిరుమల్ కుటుంబ సభ్యులకు బుధవారం రూ.85 వేల ఎల్‌వోసీని అందజేశారు. తిరుమల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వైద్య ఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి ఎల్‌వోసీ మంజూరు చేయించారు. సోహెల్, శేఖర్, సంగెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఫారెస్ట్ రేంజర్

జగిత్యాలక్రైం: జగిత్యాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన పద్మారావు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఆయన వెంట డీఐఆర్వో అరుణ్‌కుమార్ ఉన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి

• కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్



మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మెట్‌పల్లిరూరల్: గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. మెట్‌పల్లి మండల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలన్నారు. తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీవో రఘువరన్,మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొండగట్టు: పరిసరాల పరిశుభ్రత పాటించి, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పిలుపునిచ్చారు. కొడిమ్యాల మండల కేంద్రంలో బుధవారం పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొని పంప్ హౌస్ ప్రాంతంలో మొక్కలు నాటారు. అంతకుముందు కొడిమ్యాలలో 37 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూప, తహసీల్దార్ నాయకులు నారాయణ, జీవన్ రెడ్డి, శంకర్, నాగభూషణ్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం



జెండా ఆవిష్కరిస్తున్న పద్మశాలీ నాయకులు

కోరుట్ల: పట్టణంలోని పద్మశాలీ కులోన్నతి సంఘంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు సన్మానం

రాయికల్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం రాయికల్ పట్టణంలోని పద్మశాలి సంఘ భవనంలోని యువజన సంఘం ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై వస్త్రాలు తయారుచేస్తున్న చేనేత కార్మికులను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, పద్మశాలి సేవ సంఘం అధ్యక్షుడు తాటిపాముల విశ్వనాథం, యువజన సంఘం అధ్యక్షుడు సామల్ల సతీశ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

మల్యాల: జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని మల్యాలలో బుధవారం చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో బోడ గోవర్ధన్, రాములు, ఆనందం, తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

ధర్మపురి/బుగ్గారం: ధర్మపురిలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో, బుగ్గారం మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌లో బుధవారం ఫుడ్‌సేఫ్టీ జిల్లా అధికారి అనూష ఆధ్వర్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ముందుగా గురుకుల పాఠశాలలోని వంట గదులను, స్టాక్ రూంను పరిశీలించి పిల్లలకు అందించే భోజన సామాగ్రి, నిత్యావసర వస్తువుల నాణ్యతలను పరిశీలించారు. అనంతరం రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. విద్యార్థులు మెనూ ప్రకారం వేడి వేడిగా భోజనాన్ని అందించాలని ఆదేశించారు. బుగ్గారం ఎస్సీ హాస్టల్‌లో పలు పదార్థాలు, వంట సామగ్రి పూర్తిగా చెడిపోయినట్లు జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి డా.అనూష తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు వారు తెలిపారు.

సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన

మల్యాల: మండలంలోని ప్రతిభా పాఠశాలలో బుధవారం మల్యాల పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాల నియంత్రణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్సై నరేశ్‌కుమార్ మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తులు పంపించే వెబ్‌సైట్లు ఓపెన్ చేయవద్దని, అప్రమత్తంగా ఉండాలని, ఓటీపీ నంబర్ ఎవరికి చెప్పవద్దని సూచించారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని విద్యానగర్ ప్రాంతానికి చెందిన లెక్కల రూపను వేధించిన ఆయన భర్త లెక్కల సురేశ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఎస్సై తిరుపతి తెలిపారు. లెక్కల సురేశ్ గత కొద్దికాలంగా మద్యానికి బానిసై రూపను మానసికంగా, శారీరకంగా వేధించడంతో పాటు, ఈనెల 6న అర్ధరాత్రి రూపతో పాటు, ఆమె ఇద్దరు పిల్లలపై దాడిచేసి గాయపర్చాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సారంగాపూర్ పశువైద్యాధికారిగా సునీల్

సారంగాపూర్: మండల పశువైద్యాధికారిగా డాక్టర్ జె. సునీల్ నియమితులయ్యారు. ఇంతకుముందు పశువైద్యాధికారిగా పనిచేసిన డాక్టర్ రాజేందర్‌రెడ్డి మేడిపల్లి మండలం పశువైద్యాధికారిగా బదిలీ కావడంతో ఆయన స్థానంలో డాక్టర్ సునీల్ బాధ్యతలు చేపట్టనున్నారు.

వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలి



కాలనీవాసులతో మాట్లాడుతున్న జ్యోతి

జగిత్యాల: సీజనల్ వ్యాధుల బారిన పడకుండా చూసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో నీరు నిలిచిన చోట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీరు నిలిచి ఉన్న చోట్లలో ఆయిల్‌బాల్స్ వేయాలని, గంబూసియా చేపలను వదిలిపెట్టాలని అధికారులను ఆదేశించారు.కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు కూతురు పద్మ, దుర్గయ్య, నవీన్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు సమయానికి నడపాలని ఆర్‌ఎంకు వినతి

రాయికల్: మండలంలోని జూనియర్ కళాశాల, మోడల్‌స్కూల్ విద్యార్థుల సమయపాలన ప్రకారం జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులు నడిపించాలని కోరుతూ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి బుధవారం కరీంనగర్ టీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎంకు లేఖ ద్వారా వినతిపత్రం సమర్పించారు. బస్సులు సమయానికి కళాశాల సమయానికి రాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సమయవేళలు పాటించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

పెగడపల్లి: సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై మోడల్ స్కూల్‌లో బుధవారం విద్యార్థులకు స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూనే డయల్ 100పై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్సై సత్తయ్య సూచించారు. అపరిచితుల నుంచి ఎస్ఎంఎస్, ఈ మెయిల్, వాట్సాప్‌ల ద్వారా వచ్చే లింక్స్‌ను క్లిక్ చేస్తే మీ మొబైల్‌లోని డేటా మొత్తం సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుందని హెచ్చరించారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 కు కాల్ చేయాలన్నారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రవి, పోలీస్ సిబ్బంది సంపత్, వెంకటేశ్, రాజేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రోడ్డుపై పశువులు.. ట్రాఫిక్‌కు తిప్పలు

జగిత్యాలటౌన్: పట్టణంలోని ప్రధాన రోడ్లపై సంచరిస్తున్న పశువులతో ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ ప్రమాదాల్లో వాహనదారులు గాయాలపాలవుతుండగా, కొన్నిసార్లు పశువులు సైతం ప్రాణాలు కోల్పోతున్నాయి. ఇటీవల యావర్‌రోడ్డులో జరిగిన ప్రమాదంలో ఓ గోవు చనిపోయింది. రోడ్లపై సంచరిస్తున్న పశువుల యజమానులను గుర్తించి అప్పగించాలని లేదా గోశాలలకు తరలించి ప్రమాదాలు నివారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

మూఢ నమ్మకాలను వీడి శాస్త్ర విజ్ఞానంపై దృష్టిపెట్టండి



మూఢ నమ్మకాలపై ప్రదర్శన ఇస్తున్న నరేశ్

సారంగాపూర్: విద్యార్థులు మూఢ నమ్మకాలను వీడి శాస్త్ర విజ్ఞానంపై దృష్టిపెట్టాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి నరేశ్ అన్నారు. బుధవారం సారంగాపూర్ కస్తూర్బా బాలికల విద్యాలయంలో మూఢనమ్మకాలు నిర్మూలన, మహిళల రక్షణ అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంకా మూఢనమ్మకాల నుంచి కొంత మంది ప్రజలు బయటకు రావడం లేదన్నారు.మూఢ నమ్మకాలపై ప్రదర్శనలిచ్చారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేకాధికారి వీణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మపురి సమాచారం



ధర్మపురి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం గదుల సమాచారం ఈ విధంగా ఉంది.

కాంప్లెక్స్ పేరు	మొత్తం	అద్దె రూ.
శ్రీలక్ష్మీనృసింహ సదన్ ఏసీ	02	1000
నాన్ ఏసీ గదులు	28	500
ఫోన్ నెం : 08724-273888		
దేవాలయం వెనుక ఏసీ గదులు	26	1000
ఎస్ఆర్ఆర్ ధర్మశాల	10	250
ఫోన్ 995931616		
టీటీడీ ధర్మశాల నాన్ ఏసీ	10	250
ఫోన్ నెం. 7330859722		

– ధర్మపురి

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



కోరుట్లలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కోరుట్ల రూరల్: పట్టణంలో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. జనగామలో న్యాయవాద దంపతులు అమృతరావు, కవితపై స్థానిక సీఐ, ఎస్సై, పోలీసులు పోలీస్ స్టేషన్‌లో అకారణంగా దాడి చేయటాన్ని ఖండిస్తున్నామన్నారు. న్యాయవాద దంపతులకు మద్దతుగా కోరుట్ల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టులో విధులు బహిష్కరించి కోర్టు ముందు నిరసన తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తన్నీరు శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి సుతారి శ్రీనివాస్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ధర్మపురి: జనగామ, సిరిసిల్ల కోర్టుల్లో న్యాయవాదులపై అక్కడి పోలీసులు దాడికి పాల్పడిన సంఘటనను నిరసిస్తూ బుధవారం ధర్మపురి కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రౌతు రాజేష్, ఉపాధ్యక్షుడు రామడుగు రాజేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: సిరిసిల్ల,జనగామ కోర్టు పరిధిలో న్యాయవాదులపై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ మెట్‌పల్లిలో న్యాయవాదులు బుధవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా కోర్టు ముందు తమ నిరసనను వ్యక్తం చేశారు.అనంతరం మాట్లాడుతూ పోలీసులు సివిల్ కేసుల్లో జోక్యం జేసుకోవడం, న్యాయవాదులపై పోలీసులు దౌర్జన్యం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లింబాద్రి,న్యాయవాదులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• **స్కానింగ్ సెంటర్లలో తనిఖీ**

మెట్‌పల్లి: పట్టణంలోని పలు స్కానింగ్ సెంటర్లల్లో బుధవారం మాతా శిశు సంరక్షణ అధికారి ముస్కు జయపాల్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా స్కానింగ్‌లకు సంబంధించిన వివరాలను ప్రతి నెలా అందజేయాలన్నారు. అలాగే లింగ నిర్ధారణ పరీక్షలు చేయవద్దని, నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

• **మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలి**

జగిత్యాల: మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు విజయలక్ష్మి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ దేశంలో మహిళలపై జరుగుతున్న హింసలు, ఆకృత్యాలను వెంటనే నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ అణిచివేత వైఖరీని వీడాలన్నారు. రిజర్వేషన్లు అమలు చేసి కేంద్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు శోభారాణి, అనిత పాల్గొన్నారు.

• **అవయవ దానం ప్రాణ దానంతో సమానం**

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమ్మ అవయవ దాన ప్రోత్సాహకుల సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అవయవదానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు గంజి ఈశ్వర లింగం మాట్లాడుతూ అవయవ దానం ప్రాణ దానంతో సమానమన్నారు. కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ గాక్టర్ ముత్యం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అవయవ దానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సమన్వయ కర్త పసుపులేటి రమాదేవి. వైస్ ప్రెసిడెంట్ కిషోర్, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు చెన్నా విశ్వనాథం, పాల్గొన్నారు.

• **వయనాడ్ బాధితులకు సహాయ నిధి**

జగిత్యాలటౌన్: కేరళలోని వయనాడ్ వరద బాధితుల సహాయార్థం కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సహాయ నిధి కార్యక్రమాన్ని ఇందిరాభవన్‌లో సేవాదళ్ ఉత్తర తెలంగాణ జిల్లాల ఇన్‌చార్జి నీలకంఠేశ్వర్‌రావు బుధవారం ప్రారంభించారు. కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బాజోజి ముఖేష్ ఖన్నాను అభినందించారు. ఈ సహాయ నిధి సేకరణలో ప్రతి కాంగ్రెస్ కార్యకర్త భాగస్వామి కావాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి బండ శంకర్, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, సేవాదల్ ప్రతినిధులు మారుతీ బాపూజీ, చంద్రయ్య నాయకులు పాల్గొన్నారు.

• **పారిశుద్ధ్య పనుల పరిశీలన**

కోరుట్ల రూరల్: మండలంలోని అయిలాపూర్‌లో పారిశుద్ధ్య పనులను జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ బుధవారం పరిశీలించారు. స్వచ్ఛదనం-పచ్చదనంలో భాగంగా గ్రామంలో లోతట్టు ప్రాంతాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

• **12న ఎమ్మార్పీఎస్ విజయోత్సవ సభ**

మేడిపల్లి: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పుతో మాదిగ, మాదిగ ఉప కులాలకు న్యాయం జరుగుతుందని నాయకులు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం మాట్లాడారు. ఈనెల 12న మేడిపల్లిలో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని, మాదిగలు, మాదిగ ఉపకులాల వారు అధిక సంఖ్యలో సభకు హాజరుకావాలని కోరారు. రిజర్వేషన్‌ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మేడిపల్లి మాజీ ఎంపీపీ మకిలి ఇశ్రాయిల్, ఒడ్యాడు మాజీ సర్పంచ్ దువాస గంగాధర్, తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం భీమారం మండల అధ్యక్షుడు బంగారు దీపక్, మేడిపల్లి మండల అధ్యక్షుడు దప్పు ప్రేమ్ సాగర్ , భీమారం మండల అధ్యక్షుడు చిలివేరి వెంకటేష్,తదితరులు పాల్గొన్నారు.

• **ఆలయాలు నిర్మించాలని వినతి**

మెట్‌పల్లిరూరల్: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మెట్‌పల్లి మండలం మేడిపల్లిలోని తాతమ్మ,పోచమ్మ ఆలయాలు పోయే అవకాశం ఉన్నందునా తిరిగి పునర్‌నిర్మించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిని కలిసి బుధవారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.సర్వే నెం 394 లో పోచమ్మ గుడి, సర్వే నెం 408/2 లో తాతమ్మ గుడి ఉందని అధికారి దృష్టికి తీసుకెళ్లారు.కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ

ధర్మపురి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం పోలీసులు విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ .. చెడు స్నేహితులతో స్నేహం చేస్తే చెడు అలవాట్లు నేర్చుకుంటారని దాంతో భవిష్యత్తు జీవితం పాడవుతుందని తెలిపారు. మైనర్లు వాహనాలు నడుపకూడదని, 18 ఏళ్లు నిండాకే వాహనాలు నడపాలని సూచించారు.సామాజిక సేవకుడు ఇన్‌స్పాక్ట్ ట్రైనర్ రేణికుంట రమేశ్ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెల్గటూర్ ఎస్సై ఉమాసాగర్, హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.